క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్ పర్సన్ వీజీఎంవీఆర్ కృష్ణారావు ఆకాంక్షించారు. ఏలూరు స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్, ట్రేస్ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో సీతంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రేస్ ఇండియా సంస్థ ప్రతినిధి దిడ్ల యాంజిలో, ఏలూరు స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మార్గాని శ్రీనివాసరావు, ని.శివకుమార్, కోశాధికారి వీవీవీ మురళీ కృష్ణమోహన్, ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత, జి.రాజ్యలక్ష్మి, తోట ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

చేబ్రోలు పోలీసులకు రివార్డు



పోలీసులకు చెక్‌లను అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు (టూటౌన్): పేకాట కేసుకు సంబంధించి కోర్టు అందించిన రివార్డు సొమ్మును చేబ్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఎస్పీ మేరీ ప్రశాంతి శుక్రవారం తన కార్యాలయంలో అందజేశారు. 2023, జనవరి 16న చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంగుటూరు మండలం కంసాలిగుంటలో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 23 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.8.45 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి 23 మంది ముద్దాయిలను 2023, డిసెంబరు 29న కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం వారికి రూ.300 చొప్పున జరిమానా విధించారు. ఈ కేసులో చేబ్రోలు పోలీస్ స్టేషన్ సిబ్బందికి కోర్టు రూ.1.65 లక్షల రివార్డు ఇచ్చింది. ఈ మేరకు చెక్కులను పోలీస్ సిబ్బందికి ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శుక్రవారం అందజేశారు. నాటి చేబ్రోలు ఎస్సై స్వామి, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

పెదపాడు: ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెదపాడు పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్టు పశువైద్యాధికారి వాణి సంధ్యశ్రీ తెలిపారు. శనివారం ఉదయం ఉచితంగా వ్యాక్సిన్‌లు వేస్తామన్నారు. కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్షాకాలం... అప్రమత్తతతో జ్వరాలు దూరం

- పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత
- ఏలూరు నగరంలో ప్రజలకు అవగాహన
- దోమల నివారణకు పటిష్ట చర్యలు

ఏలూరు టౌన్: వర్షాకాలంలో ప్రజలు సీజనల్, విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు రావటంతో పరిసరాల్లో నీటి నిల్వలు పెరిగిపోవటం, దోమలు విజృంభించటంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఒకవైపు డయేరియా, మరోవైపు దోమకాటుతో డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి విష జ్వరాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితులు ఉన్నాయి. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. డ్రెయినేజీల్లో నీటి పారుదల ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

విషజ్వరాల నివారణ చర్యలు

ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఇల్లు, కార్యాలయాలు తదితర చోట్ల నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారులు పేర్కొంటున్నారు. ఏలూరు నగరంలో మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడకుండా ముందుస్తు నివారణ చర్యలను ఏలూరు ఏరియా మలేరియా అధికారి గోవిందరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చేపడుతున్నారు. ఏలూరులోని తంగెళ్లమూడి, బీడీ కాలనీ, రాణినగర్, ఇజ్రాయేల్‌పేట, ఏటిగట్టు, నాగేంద్ర కాలనీ, మస్తాన్‌మన్యం కాలనీ, వైఎస్సార్ కాలనీ, రంగారావు కాలనీ ఇలా అనేక ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రజలను సైతం చైతన్యవంతులను చేస్తున్నారు. కరపత్రాల పంపిణీ, అవగాహన ర్యాలీలు చేస్తున్నారు. అమీనాపేటలోని ప్రభుత్వ హాస్టల్స్‌లోనూ దోమల నివారణకు మందును పిచికారీ చేశారు.



ఏలూరులో డెంగీ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



తంగెళ్లమూడిలో నిల్వ నీటిలో దోమల లార్వాను పరిశీలిస్తున్న దృశ్యం



లంకపేట ప్రాంతంలో డ్రెయినేజీలో దోమల నివారణ మందును స్ప్రే చేస్తున్న సిబ్బంది



అమీనాపేటలోని ప్రభుత్వ హాస్టల్‌లో దోమల నివారణకు మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

ఏలూరు నగరంలో విష జ్వరాలు ఇలా

సంవత్సరం	డెంగీ కేలసు	మలేరియా కేసులు
2022	35	4
2023	45	3
2024 (జూన్ వరకు)	09	నిల్

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం



వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఒకవైపు వాతావరణంలో వస్తోన్న మార్పులు, మరోవైపు దోమకాటుతో ప్రమాదకరమైన విష జ్వరాలు సోకుతాయి. ప్రజలు జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఏలూరు నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు చేయటంతోపాటు ప్రజలకు ఉచితంగానే మందులు అందజేస్తాం. డెంగీ జ్వరంతో ప్లేట్‌లెట్స్ పడిపోవటంతో ఒక్కోసారి ప్రాణాపాయం ఉంటుంది. మలేరియా, చికున్ గున్యా ఇలా జ్వరాలు వచ్చిన వెంటనే వైద్యుల వద్దకు వెళితే పరీక్షించి చికిత్స అందిస్తారు. భయపడాల్సిన అవసరం లేదు కానీ.. ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– గౌతమ్, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ, పవర్‌పేట

డెంగీ, మలేరియాతో జాగ్రత్త

మంచినీటిలో పెరిగే ఈజిప్ట్ ఏడిస్ ఆడ దోమ కాటుతో డెంగీ వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. వారంలో ఒకసారైనా ఖచ్చితంగా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. వర్షాకాలంలో వచ్చే విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు రావాలని సూచిస్తున్నారు.

'సమస్యలు పరిష్కరిస్తా'

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొవస్తే వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. స్థానిక కోటదిబ్బ ఎస్ఆర్‌వన్ వద్ద మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐటీయూసీ పతాకాన్ని యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈ పి.కొండలరావు, డీఈఈ తాతబ్బాయి, ఏఈ సాయి, యూనియన్ వ్యవస్థాపకులు చిలుకూరి రమేష్ కుమార్, ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, నాయకులు సీవీ రమణ, బి.నారాయణరావు, ఎస్ఎంవీ సుబ్బారావు, ఎస్ బాజీ, కె.శ్రీనివాస్, డి.అప్పారావు, డి.దుర్గాప్రసాద్, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

ఏలూరు (టూటౌన్): బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లోనూ ఎదగాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. ఏలూరులో ఒక సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు విచ్చేసిన సుమన్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు బీసీ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ బీసీలు అన్ని పార్టీల్లో ఉండాలని, ఇదే సమయంలో బీసీ కులాల్లో రాజకీయాలు ఉండకూడదని సూచించారు. బీసీలంతా కలిసికట్టుగా ఐక్యతతో పనిచేయాలన్నారు. బీసీలు ఏ రాజకీయ పార్టీలో ఉన్నా తమ హక్కులను పోరాడి సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ప్రధానంగా విద్య, రాజకీయ, ఆర్థికంగా బీసీలు ఎదిగినప్పుడే బీసీలు అభివృద్ధి పథంలో పయనించేందుకు వీలు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా బీసీలకు చెందిన పలు సమస్యలపై ఆయన అనేక విషయాలను బీసీ నాయకులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, నూరు బాషా రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల బాజీ, సామాజిక కార్యకర్త చప్పిడి సత్యానారాయణ, యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఆర్ విఠల్ కుమార్, జిల్లా కన్వీనర్ పామర్తి యేసురాజు, తూర్పుకాపు సంఘం నాయకుడు అప్పిరెడ్డి రంగ ముత్యాలు, బాయి వెంకట్రావు, బోయిన కేదారేశ్వరరావు, కొత్తల శివకుమార్, నల్లపాటి రాజేష్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



సినీనటుడు సుమన్‌కు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందిస్తున్న నాయకులు

మేధా పాట్కర్‌పై శిక్షను రద్దుచేయాలి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ పర్యావరణ వేత్త, నర్మదా బచావో నాయకురాలు మేధా పాట్కర్ పైన ఢిల్లీ కోర్టు విధించిన శిక్ష, భారీ జరిమానాను రద్దు చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మేధా పాట్కర్‌పై ఇటీవల ఢిల్లీ కోర్టు ఐదు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల భారీ జరిమానా విధిస్తూ తీర్పు నివ్వడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ తీర్పును ప్రజాస్వామిక వాదులు అందరూ తీవ్రంగా ఖండించాలని తెలిపారు. నర్మదా డ్యామ్‌లో మునిగిపోయే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, పెద్ద ఎత్తున ఆందోళన చేసిన ఫలితంగా పునరావాస సమస్యను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడంతో మేధా పాట్కర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఎవరో మెయిల్లో పంపించిన దానిపై ఆధారపడి గుజరాత్లో ఫైలైన కేసును ఢిల్లీకి మార్చుకుని 23 సంవత్సరాల తర్వాత ఆమెపై పైవిధంగా తీర్పు ఇవ్వడం బీజేపీ ఫాసిస్ట్ తరహా పాలనను తెలియజేస్తుందని వివరించారు. పునరావాసం కోసం గిరిజనులు, పేదల హక్కుల కోసం పోరాడే వారిపై కేసులు పెట్టడం, శిక్షలు విధించడం సరికాదని తెలిపారు. ప్రజాస్వామిక వాది అయిన అరుంధతి రాయ్‌పైనా 1400 పేజీల ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు పెట్టడానికి బీజేపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. ప్రజల జీవించే హక్కును కూడా కాలరాస్తోన్న వారిపై ఏవిధమైన కేసులు, శిక్షలు విధించడం లేదని ఆరోపించారు.

బాలికల పాఠశాలలో ఎస్పీఎల్ ఎన్నికలు



ఓటరు చేతివేలిపై సిరా చుక్క వేస్తున్న ఉపాధ్యాయుడు



ఎన్నికల తీరును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : ఏలూరు కస్తూరిబా ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్ఎం జి.సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఎస్పీఎల్ ఎన్నికలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ చేపట్టే విధి విధానాల మాదిరిగా ఇక్కడా నిబంధనలు అమలు చేశారు. హెచ్ఎం 10 రోజుల ముందుగా ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్లు, డిపాజిట్ స్వీకరణ, ఉపసంహరణ, స్క్రూటినీ చేపట్టారు. తర్వాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ప్రచారానికి అవకాశం కల్పించారు. తర్వాత పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు మాదిరిగా విద్యార్థుల వేలుపై సిరా చుక్క వేసి ఎన్నికల ముగించారు. తర్వాత కౌంటింగ్ నిర్వహించి, గెలుపొందిన ఎస్పీఎల్‌తో హెచ్ఎం ప్రమాణ స్వీకారం చేయించారు. దీంతో విద్యార్థులు హర్షం వెలిబుచ్చారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	16
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	29
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	12
ఏలూరు - తిరుపతి	16.00	4830	27

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	10, 15
బెండకాయలు	32	కంద	64
పచ్చిమిర్చి	46	బీట్‌రూట్	34
కాకర కాయలు	50	కీరా దోస	48
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	108
బీరకాయలు (పందిరి)	44	అల్లం	180
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-48	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	56	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	52

నేటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీ సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం శ్రీచక్ర అభిషేకం, సహస్రనామార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు భక్తులచే సామూహికంగా కుంకుమ పూజ, అనంతరం పంచహారతులు, వేద మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఉత్సవాల ముగింపు రోజు ఈ నెల 15న ఉదయం 9.01 గంటలకు చండీ హోమ సహిత లలితా హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

అవయవ దానంపై రేపు సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన అవయవదానంపై నగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక పత్తేబాదలోని శ్రీసాయి రాధ మినీ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రకతదానం, నేత్రదానం, శరీర దానం, విద్యాదానం అనే అంశాలపై సైతం ఆమె అవగాహన కలిగిస్తారని, నగర ప్రజలు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

మానసిక ఒత్తిడిపై అవగాహన

దెందులూరు: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ మంచి ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండాలని ఏలూరు సర్వజన వైద్యశాల మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వంశీకృష్ణ, సైకాలజిస్టు డాక్టర్ సాయికుమార్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం వ్యాయామ ప్రభుత్వ విద్యా కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ పిల్లల మానసిక స్థితిపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యులకు ప్రిన్సిపాల్ డాక్టర్ నత్తానియేలు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

అపరిశుభ్ర పరిసరాలు వ్యాధులకు ఆవాసాలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు (టూటౌన్): అపరిశుభ్ర పరిసరాలు వ్యాధులకు ఆవాసాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. స్థానిక లంకపేట రెండవ రోడ్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వర్షాకాలంలో వర్షాల వల్ల కీటకాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ముఖ్యంగా దోమలు, ఈగలు ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, అతిసారా, కామెర్లు, టైఫాయిడ్ మొదలగు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంటి పరిసరాలు, పల్లపు ప్రాంతాలను మట్టితో పూడ్చుకోవాలని, సాధారణంగా మనం వాడే తొట్టిలు, డ్రమ్ములు, ఓవర్ ట్యాంక్‌లు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. ఈగల అభివృద్ధి నిరోధానికి ఇంటి పరసరాల్లో చెత్త పోగులు, పేడ పోగులు పెట్టరాదని అన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.నిర్మల, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంఘస్తుల శ్రమదానం

దెందులూరు: ఆధ్యాత్మిక అభివృద్ధికి సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మాణానికి సంఘస్తులు శ్రమదానం చేశారు. శుక్రవారం గౌడ వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సాల్వేషన్ ఆర్మీ చర్చికి సంఘస్తులు ప్రవహరీ నిర్మాణంలో స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించారు. వీరిని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కె.రమణయ్య అభినందించారు.

నేడు పెదవేగి మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: పెదవేగి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్యశ్రీ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ఏర్పాటుచేసినట్టు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విచ్చేస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ అన్ని శాఖల మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

దెందులూరు : హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే ఎంవీఆర్ యాక్ట్ ప్రకారం జరిమానా లేదా మోటార్ సైకిల్ సీజ్ చేస్తామని డీఎస్పీ జి.లక్ష్మయ్య హెచ్చరించారు. డీఎస్పీ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే సీజ్ చేయడంతో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో సీఐ కె.శ్రీనివాస కుమార్, ఎస్సైలు శుభాకర్, కె.స్వామి, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు చిన్నారుల గుర్తింపు

దెందులూరు: చిన్నారులను తప్పనిసరిగా పాఠశాలలో చేరాలని ఎంపీడీఓ వి.శ్రీలత, ఎంఈఓలు ఏవీఎన్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గాలాయగూడెంలో బడికి వెళ్లకుండా వీధుల్లో నలుగురు చిన్నారులను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. శనివారం నుంచి పాఠశాలకు వెళ్తామని చిన్నారులు అధికారులకు తెలిపారు. గాలాయగూడెం పాఠశాల హెచ్ఎంకు ముగ్గురు చిన్నారులకు అడ్మిషన్ ఇవ్వాలని ఎంఈఓ సూచించారు.

అతిసార నియంత్రణపై అవగాహన

దెందులూరు: అతిసార వ్యాధి ప్రబలకుండా ముందస్తు చర్యలపై అంగన్‌వాడీలకు, ఆశ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ వీ.శ్రీలత, ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గాలాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు.